
# పుస్తకం ఇంకా పబ్లిష్ కాకపోయినా వివాదంలోకి లాగారు


## భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె




విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై ఇటీవల తీవ్ర చర్చ జరిగింది. దీనిపై నరవణె తాజాగా స్పందించారు. తన పుస్తకం ఇంకా పబ్లిష్ కాకపోయినా, అనవసరంగా తనను ఈ వివాదంలోకి లాగారంటూ ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నరవణె రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. నరవణె రచించిన మరో పుస్తకం 'ద క్యూరియస్ అండ్ ద క్లాసిఫైడ్ అన్‌ఎర్తింగ్ మిలిటరీ మిత్స్ అండ్ మిస్టరీస్' ఇటీవల విడుదలైంది. ఈ క్రమంలోనే ఆయన పీటీఐతో మాట్లాడుతూ.. "ఈ మధ్య జరిగిన నా పుస్తకం వివాదం తర్వాత రెండు పుస్తకాలు రాశాను. వాటిల్లో ఒకటి విడుదలైంది. మరోటి త్వరలో రానుంది. ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీని పూర్తిగా పరిశీలించేవరకు ప్రచురణను నిలిపివేయమని రక్షణ మంత్రిత్వశాఖ కోరింది. ఆ విషయం అక్కడితో ముగిసింది. నేను ముందుకెళ్లాను.. నా వరకు అది ముగిసిపోయిన అధ్యాయం. కానీ ప్రచురితం కాని పుస్తకాన్ని వెలుగులోకి తీసుకొచ్చి కొందరు దానిపై తీవ్ర చర్చలు చేశారు. దీనివల్ల పుస్తకంతో పాటు నన్నూ ఈ వివాదంలోకి లాగినట్టే కదా. అది ఏమాత్రం సమంజసం కాదు" అని రాహుల్‌గాంధీని ఉద్దేశించి పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. చైనా దళాలతో భారత బలగాల ఘర్షణకు సంబంధించి వివాదాస్పద అంశాలను ప్రస్తావిస్తూ నరవణె రాసిన ఈ పుస్తకానికి రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ప్రచురణ అనుమతి లభించలేదు. అయినప్పటికీ అప్పట్లో దీన్ని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లోక్‌సభకు తీసుకువెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది.

# రూ.3,200 కోట్ల క్రిప్టో కరెన్సీ ఫ్రీజ్ చేశాం

## అమెరికా ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్



విశ్వంభర, నేషనల్ బ్యూరో : అమెరికా–ఇరాన్ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియని అనిశ్చితి నెలకొంది. ఒకవైపు పాకిస్థాన్ వేదికగా చర్చల ప్రక్రియ నడుస్తోంది.. మరోవైపు, హర్మూజ్‌లో అమెరికా దిగ్బంధనం కొనసాగుతోంది. ఇవి చాలదన్నట్లు ఇరాన్‌కు సంబంధించిన 344 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3242 కోట్ల) విలువైన క్రిప్టో కరెన్సీని ఫ్రీజ్ చేశామని ఆర్థిక శాఖ మంత్రి స్కాట్ బెసెంట్ తాజాగా వెల్లడించారు. ఒప్పందం కుదుర్చుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు అమెరికా ఈ తరహా ప్రయత్నాలు చేస్తోంది. "నిధులు సమకూర్చుకోవడం, వాటిని తరలించడం వంటి విషయాల్లో ఇరాన్ సామర్థ్యాన్ని క్రమంగా దెబ్బతీస్తాం. దానిలో భాగంగానే ఇరాన్‌తో సంబంధం ఉన్న పలు వాలెట్లపై ఆంక్షలు విధిస్తున్నాం. దాంతో నిధులు ఫ్రీజ్ అవుతాయి" అని బెసెంట్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇదిలా ఉంటే.. హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ విషయంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ (గ్రావవ ఎవస్త్రంవ్ష్ట) మాట్లాడుతూ.. జలసంధిపై నియంత్రణను మరింత కాలం పొడిగిస్తామన్నారు. అది శాశ్వత దిగ్బంధనంగా మారే అవకాశమూ ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు అభినందనలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: సమ్మె బాట పట్టిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు సఫలమైన సంగతి తెలిసిందే. కార్మికులు డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో మూడు రోజుల సమ్మె అనంతరం ఇవాళ బస్సులు రోడ్లపైకి వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులకు ఏపీ ఏపీ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధినందనలు పోరాటంతో హక్కులు సాధించిన తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు హృదయపూర్వక అభినందనలు. అలాగే తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె నేపథ్యంలో వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి పరిష్కరించిన తెలంగాణ ప్రభుత్వానికి ఏపీ పీటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ తరపున కృతజ్ఞతలు అంటూ ఇవాళ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇవాళ విజయవాడని ఏపీ పీటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి. నరసయ్య ఈ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం 2019 లో తెలంగాణలో ఆర్టీసీ యూనియన్లను రద్దు చేయడం అనేది దురదృష్టకరమైన చర్యగా పేర్కొంటూ, ప్రస్తుత సమ్మె నేపథ్యంలో యూనియన్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం అంగీకరించడం ఒక శుభ పరిణామమని వారు అభిప్రాయ పడ్డారు. అలాగే పెండింగ్ వేతన సవరణల పరిష్కారం దిశగా అడుగులు పడటం, అలాగే ఇతర సమస్యల పరిష్కారం కోసం మంత్రివర్గం, ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయడం ఉద్యోగుల భవిష్యత్తుకు మేలు చేసే నిర్ణయమని పేర్కొన్నారు. విలీన ప్రక్రియలో ఉద్యోగుల హక్కులు దెబ్బతినకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం వారు చేపట్టే ప్రతి పోరాటానికి ఏపీ పీటిడి (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.

# నరకకూపాలు వ్యాఖ్యలపై ట్రంప్‌పై ధ్వజమెత్తిన డెమోక్రాట్లు

విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత్, చైనా నరకకూపాలంటూ ఓ వ్యక్తి చేసిన వ్యాఖ్యలతో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏకీభవించడంపై డెమోక్రాట్లు మండిపడ్డారు. భారతీయ అమెరికన్లనే కాదు, ప్రపంచంలో అమెరికాకు కీలక భాగస్వామైన భారత్‌ను కూడా అధ్యక్షుడు అవమానించారని డెమొక్రటిక్ పార్టీ సభ్యుడు రాజా క్రిష్ణమూర్తి అన్నారు. భారత సంతతి వ్యక్తులను ట్రంప్ తక్కువ చేసి చూపిస్తున్నారని, దీనిపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించాలని కాంగ్రెస్ సభ్యుడు రో ఖన్నా అన్నారు. రేడియో ప్రయోక్త మైఖేల్ సావెజ్ వ్యాఖ్యలతో ట్రంప్ ఏకీభవించి అధ్యక్ష కార్యాలయ గౌరవాన్ని దిగజార్చారని మరో కాంగ్రెస్ సభ్యుడు అమీ బేరా పేర్కొన్నారు. భారత్‌ను నరకంతో పోలుస్తూ అమెరికన్ రేడియో హోస్ట్ మైఖెల్ సావేజ్ షేర్ చేసిన లేఖను ట్రంప్ రీపోస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ట్రంప్ వ్యాఖ్యలను ముంబయిలోని ఇరాన్ కాన్సులేట్ తిప్పి కొట్టింది. భారత్‌లోని అభివృద్ధి, సాంస్కృతిక విలువలు ట్రంప్‌నకు తెలిసేలా ఎవరైనా ఆయనను భారత పర్యటనకు తీసుకువస్తే బాగుండేది అంటూ పోస్ట్ పెట్టింది. భారత్‌కు వచ్చి చూసి ఆ తర్వాత ఆ దేశం గురించి మాట్లాడాలని హితవు పలికింది. మహారాష్ట్రలోని అత్యాధునిక సదుపాయాలు, సంప్రదాయ వేడుకలు, పర్యాటక ప్రదేశాలకు సంబంధించిన వీడియోను షేర్ చేసింది.

# విలీనంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం

## ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: కార్మికుల చిరకాల కోరికైనా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశంపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుందని... దీనికి సంబంధించిన విధివిధానాలు, ఇతర సాంకేతిక అంశాలపై ప్రభుత్వం త్వరలోనే తుది నిర్ణయాన్ని వెల్లడిస్తుందని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తెలిపారు. అలాగే ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, 2021 పే స్కేల్‌ను అమలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. ఉద్యోగులందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో వేతన సవరణ ఉందని నాగిరెడ్డి వెల్లడిం చారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల పునరుద్ధరణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని... ప్రజాస్వామ్యబద్ధంగా కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను నిర్వహించేం దుకు త్వరలోనే కార్మిక సంఘాలతో చర్చలు జరిపి విధివిధానాలను ప్రకటిస్తామన్నారు. సమ్మె కారణంగా ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి సంస్థ చింతిస్తోందని... శనివారం తెల్లవారుజాము నుంచి అన్ని డిపోల పరిధిలో వంద శాతం బస్సులన్నీ యథావిధిగా అందుబాటులో వచ్చాయన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. సంస్థను లాభాల బాటలో నడిపించడంలో కార్మికులు తమ వంతు సహకారాన్ని అందిస్తారని ఆశిస్తున్నామన్నారు.

# దిగ్బంధనం కొనసాగితే.. ప్రతీకార చర్యలు తప్పవు

## : ఇరాన్

విశ్వంభర, నేషనల్ బ్యూరో: ఒకవేళ అమెరికా తన దిగ్బంధనాన్ని కొనసాగిస్తే.. శక్తిమంతమైన సాయుధ బలగాల ప్రతీకారాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని ఇరాన్ సైనిక కమాండ్ హెచ్చరించింది. దేశ భూభాగం, సార్వభౌమాధికారం, జాతీయ ప్రయోజనాలను పరిరక్షిం చుకునే విషయంలో తమ సేనలు మునుపటి కంటే అధిక శక్తిసామర్థ్యాలను, సంసిద్ధతను కలిగి ఉన్నాయని పేర్కొంది. పశ్చిమాసియాలో శత్రువుల కదలికలను పర్యవేక్షిస్తున్నామని, హర్మూజ్ జలసంధిని నియంత్రిస్తూనే ఉంటామని తెలిపింది. ఒకవేళ అమెరికన్లు దురాక్రమణకు పాల్పడితే.. ఎదురు దెబ్బతీసేందుకు దృఢ నిశ్చయంతో ఉన్నామని స్పష్టం చేసింది. ఇరాన్ , అమెరికాల మధ్య రెండో విడత ప్రత్యక్ష చర్చలపై అనిశ్చితి నెలకొన్న వేళ.. ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ శనివారం పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో భేటీ అయ్యారు. పశ్చిమాసియా పరిస్థితులపై ఇరువురు నేతలు చర్చించినట్లు పీఎంవో తెలిపింది. అంతకుముందు పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్, విదేశాంగశాఖ మంత్రి ఇషాక్ దార్‌లతో అరాగ్చీ సమావేశమయ్యారు. అమెరికాతో శాంతి చర్చలకు సంబంధించిన అంశాలపై మాట్లాడుకున్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. అరాగ్చీతో అమెరికా ప్రతినిధులు నేరుగా చర్చలు జరుపుతారని అంతకుముందు వైట్‌హౌస్ ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం మొదలైన తర్వాత తొలిసారి ఇరాన్‌లో విమాన సేవలను పునరుద్ధరించారు. టెహ్రాన్‌లోని ఇమామ్ ఖొమేనీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి శనివారం వాణిజ్య విమానాలు రాకపోకలు సాగించాయి. ఇస్తాంబుల్, ఒమన్‌లోని మస్కట్, సౌదీ అరేబియాలోని మదీనాకు ఈ విమానాలు బయలుదేరాయి. కాల్పుల విరమణ నేపథ్యంలో ఇరాన్ గగనతలాన్ని పాక్షికంగా తెరిచిన తర్వాత ఈ చర్యలు తీసుకున్నారు.

# 10లక్షలు తగ్గిన రాఘవ్ చద్దా ఫాలోవర్లు



విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఎంపీ రాఘవ్ చడాధ కు యువతలో మంచి క్రేజ్ ఉంది. రాజ్యసభలో ఆయన వేసే ప్రశ్నలు, మాట్లాడే పద్ధతిని నెటిజన్లు తరచూ అభినందిస్తుంటారు. అయితే శుక్రవారం ఆయన ఆమ్‌ఆద్మీ పార్టీని వీడి భాజపాలోకి చేరడంపై అభిమానుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. పార్టీ మారుతున్నట్లు చడాధ ప్రకటించిన 24 గంటల్లోనే సోషల్ మీడియాలో ఆయన ఫాలోయింగ్ తగ్గిపోయింది. ఈ ఎంపీకి ఇన్‌స్టా లో 14.6 మిలియన్ల ఫాలోవర్లు ఉండగా.. నిన్నటినుంచి నేటి మధ్యాహ్నానికి ఆ సంఖ్య 13.5 మిలియన్లకు తగ్గింది. ఆయన నిర్ణయాన్ని జెన్‌జీ వ్యతిరేకించడమే దీనికి కారణమై ఉండొచ్చని రాజకీయ విశ్లేషకులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు. చడాధకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ తగ్గిపోవడంపై ఎన్సీపీ(ఎస్పీ) అధికార ప్రతినిధి అనీష్ గవాండే మాట్లాడుతూ.. ఇంటర్నెట్ మిమ్మల్ని రాత్రికి రాత్రే హీరోగా చేయగలదు.. అలాగే రాత్రికి రాత్రే జీరోకి కూడా పడేయగలదని అన్నారు. ఆయన తీసుకున్న నిర్ణయం నచ్చని కారణంగానే 10 లక్షల మంది యువత రాఘవ్ చడాధను అన్‌ఫాలో చేశారన్నారు.

# సమష్టిగా కృషి చేస్తే సమగ్ర క్రీడాభివృద్ధి

## రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: క్రీడల అభివృద్ధి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కాకుండా ప్రజల భాగస్వామ్యంతో పాటు క్రీడా సంఘాలు, కార్పొరేట్ సంస్థలు సమిష్టిగా కృషి చేస్తే సమగ్ర క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. మూడు రోజులపాటు శ్రీనగర్‌లో జరుగుతున్న చింతన్ శిబిరానికి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి( క్రీడలు) జయేశ్ రంజన్, క్రీడా సలహాదారులు ఏపీ జితేందర్ రెడ్డి చైర్మన్ శివసేనారెడ్డి ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి, ప్రముఖ క్రీడాకారులు పుల్లెల గోపీచంద్ గగన్ నారంగ్ కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వాకిటి శ్రీహరి దేశంలో మంచి, బలమైన క్రీడా వాతావరణం నిర్మాణం జరగాలంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సమిష్టిగా కృషి చేసి దేశానికి కీర్తి తెచ్చే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా ఒకవైపు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలను రాష్ట్రంలో దిగ్విజయంగా అమలు చేస్తూనే, దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చే అనేక కార్యక్రమాలను బ్రహ్మాండంగా నిర్వహిస్తుందన్నారు. హైదరాబాద్ అంటేనే ఆటలకు మారుపేరుగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు క్రీడా శాఖ అనేక వినూత్నకార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడా ప్రతిభను గుర్తించి అనేక కార్యక్రమాలు నిర్వహించడంతో రెండు దఫాలుగా నిర్వహించిన సీఎం కప్ గెలిచామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఖేలో ఇండియా కార్యక్రమాలను, జాతీయ క్రీడా దినోత్సవాన్ని సండే ఆన్ సైక్లింగ్ ఒలంపిక్స్ విజేతలను గుర్తించే కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్రం దిగ్విజయంగా ముందుకు తీసుకెళ్తుందని వివరించారు.

# కేజ్రీవాల్.. ఢిల్లీ 'రెహమాన్ డెకాయిత్'

## భాజపా నేత పర్వేశ్ వర్మ



విశ్వంభర, నేషనల్ బ్యూరో : ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై ఢిల్లీ డిప్యూటీ సీఎం పర్వేశ్ వర్మ విమర్శలు గుప్పించారు. ఇటీవల కేజ్రీవాల్ లోధి ఎస్టేట్‌లో ప్రభుత్వ బంగ్లాలోకి మారిన సందర్భంగా ఆయన రెండో శీష్ మహల్‌ని(అద్దాల మేడ) నిర్మించుకున్నారని పర్వేశ్ ధ్వజమెత్తారు. గతంలో కేజ్రీవాల్ సీఎం పదవిలో ఉన్నప్పుడు కూడా తన అధికారిక నివాసాన్ని ప్రజల సొమ్ముతో లగ్జరీ ఇంటిగా మార్చినట్టు ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. పర్వేశ్ వర్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. " మాజీ సీఎం కేజ్రీవాల్ ఢిల్లీకి రెహమాన్ డెకాయత్ లాంటివాడు. గతంలో నిరాడంబరమైన జీవితాన్ని గడుపుతానని చెప్పిన కేజ్రీవాల్ 'శీష్ మహల్2'ని నిర్మించుకున్నారు. ఢిల్లీ ఓటర్లు ఆప్ ప్రభుత్వాన్ని నిరాకరించడంతో ఇప్పుడు ఆప్ అధినేత దృష్టి పంజాబ్‌పై పడింది. కేజ్రీవాల్, సత్యేంద్ర జైన్, సంజయ్ సింగ్, మనీష్ సిసోదియాతో సహా ఆప్ నాయకులు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ నివాసం చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకున్నారు" అంటూ విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉంటున్న లోధి ఎస్టేట్ ఫొటోలను స్క్రీన్‌పై ప్రదర్శిస్తూ.. ఇదీ కేజ్రీవాల్ నిరాడంబరమైన జీవితం అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'నేను ఇంతకుముందు 'శీష్ మహల్'ని సందర్శించాను. ఇంత విలాసంతమైన భవనంలో అసలు ఎవరికైనా ఎలా నిద్ర పడుతుందని అప్పుడే అనుకున్నా" అని ఎద్దేవా చేశారు. ఈ అద్దాల మేడ వ్యవహారంపై ఆప్ స్పందిస్తూ.. "పర్వేశ్ వర్మ మీడియా సమావేశంలో ప్రదర్శించిన చిత్రాలు నిజం కాదు.. ఫేక్" అని వెల్లడించింది. అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా పనిచేసిన సమయంలో సివిల్ లైన్స్‌లో 6 ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగ్లాను అధికారిక నివాసంగా ఉపయోగించేవారు. ఆ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా అభివర్ణించింది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన దాన్ని 7–స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది.

# హైదరాబాద్ మెట్రో ఇకపై ప్రభుత్వ పరిధిలోకి




విశ్వంభర, తెలంగాణ బ్యూరో : హైదరాబాద్ మహా నగర వాసుల ప్రధాన రవాణా వ్యవస్థ అయిన హైదరాబాద్ మెట్రో రైల్‌పై తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్యం పద్ధతిలో నడుస్తున్న ఈ ప్రాజెక్టులో నాడు మెట్రోకు ఉన్న 100% ఈక్విటీని ప్రభుత్వం తన వశం చేసుకుంది. దీంతో మెట్రో రైల్ పూర్తిస్థాయిలో ప్రభుత్వ యాజమాన్యం కిందికి వచ్చింది. మెట్రో నిర్వహణ, యాజమాన్య బదిలీ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం కొత్త బోర్డు ఆఫ్ డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మెట్రో భవిష్యత్తు ప్రణాళికలు, విస్తరణ, నిర్వహణ బాధ్యతలను ఈ కొత్త బోర్డు పర్యవేక్షించనుంది. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ నూతన చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (జూ) సీఎస్ రామకృష్ణ రావును ప్రభుత్వం నియమించింది. మెట్రోను మరింత లాభసాటిగా మార్చడం, రెండో దశ విస్తరణ పనులను వేగవంతం చేయడంపై కొత్త చైర్మన్ దృష్టి సారించనున్నారు. మెట్రో నిర్వహణలో ఎల్ అండ్ టీ సంస్థ ఎదుర్కొం టున్న ఆర్థిక సవాళ్లు, రాయితీలకు సంబంధిం చిన వివాదాలకు ఈ నిర్ణయంతో తెరపడనుంది. ఈక్విటీ బదిలీ ద్వారా మెట్రోపై ప్రభుత్వానికి పూర్తి నియంత్రణ లభించడంతో పాటు, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# అంతవరకూ దిగ్బంధనంలోనే హర్మూజ్

విశ్వంభర, నేషనల్‌బ్యూరో: హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా కట్టుదిట్టమైన దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. ఈ విషయంపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ మాట్లాడుతూ.. జలసంధిపై నియంత్రణను మరింత కాలం పొడిగిస్తామన్నారు. హర్మూజ్ చుట్టూ అమెరికా నేవీ దిగ్బంధనాన్ని ఉక్కు కవచంతో పోల్చారు. ఇది శాశ్వత దిగ్బంధనంగా మారే అవకాశమూ ఉందని హెచ్చరించారు. టెహ్రాన్ తన అణ్వాయుధాల తయారీని విడనాడే వరకు ఆ దేశంపై ఒత్తిడి తెస్తూనే ఉంటామన్నారు. అంతర్జాతీయ స్థిరత్వానికి ఇరాన్ నుంచి పొంచి ఉన్న ముప్పును తొలగించడానికే తాము ఈ సాహసోపేతమైన, ప్రమాదకరమైన మిషన్‌ను చేపట్టామన్నారు. తమ అనుమతి లేకుండా హర్మూజ్‌లోకి ఏ రవాణా నౌక రాదని.. బయటకు వెళ్లదని పీట్ హెగ్సెత్ అన్నారు. జలసంధిలోని నౌకలపై దాడులు చేస్తూ.. టెహ్రాన్ సముద్రపు దొంగల ముఠాలా ప్రవర్తిస్తోందన్నారు. తన చర్యలతో సముద్ర భద్రతను అస్థిరపరుస్తోందని ఆరోపించారు. తమ దిగ్బంధనం గల్ఫ్ దాటి విస్తరిస్తోందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యాన్ని కాపాడడానికి తాము ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటామన్నారు. ఇస్లామాబాద్ వేదికగా అమెరికా–ఇరాన్ పరోక్ష చర్చలకు ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో హెగ్సెత్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

# భుజాలపై తల్లిని మోస్తూ కేదార్‌నాథ్ యాత్ర



విశ్వంభర, నేషనల్ బ్యూరో : కేదార్‌నాథ్: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న చార్‌ధామ్ యాత్ర (కేదార్‌నాథ్, బద్రీనాథ్, గంగోత్రి, యమునోత్రి)లో ఓ సన్నివేశం చూపరులను ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ఇద్దరు సోదరులు ధీరజ్, తేజ్‌పాల్ తమ 60 ఏళ్ల తల్లిని డోలీలో భుజాలపై మోసుకుంటూ రుద్రప్రయాగ్‌లోని కేదార్‌నాథ్ కు తీసుకువెళ్లారు. జీవితంలో ఒక్కసారైనా కేదార్‌నాథ్ ఆలయాన్ని సందర్శించాలనే తల్లి కోరికను తీర్చడానికి ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. తమ తల్లిని డోలీలో మోస్తూ..ఉత్తర్‌ప్రదేశ్, హిమాలయాలలోని క్లిష్టమైన మార్గాల్లో దాదాపు 1,800 కిలోమీటర్లు నడుచుకుంటూ ఆలయానికి వచ్చామన్నారు. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి కేదార్‌నాథ్ చేరుకోవడానికి తమకు మూడు నెలల 24 రోజులు పట్టిందన్నారు. ఉత్తరాఖండ్‌లో ఈ నెల 19న చార్‌ధామ్ యాత్ర మొదలయ్యింది. అక్షయ తృతీయ సందర్భంగా ఉత్తరకాశీ జిల్లాలోని గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరవడంతో యాత్ర ప్రారంభమైంది. దీంతో వందల సంఖ్యలో భక్తులు కేదార్‌నాథ్, బద్రీనాథ్ ఆలయాల్లో దైవదర్శనానికి తరలివస్తున్నారు.